దంతాలపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రంలో నిలిచిన వర్షపునీరు

జిల్లాలో భారీ వర్షం

మహబూబాబాద్ పట్టణంలో కురుస్తున్న వర్షం

మహబూబాబాద్ రూరల్, మే 27 : జిల్లాలో మంగళవారం సాయంత్రం ఉరుములు మెరుపులతో భారీ వర్షం పడింది. జిల్లాలోని దంతాలపల్లి, నర్సింహుల పేట, కేసముద్రం, గూడూరు, బయ్యారం పలు చోట్ల భారీగా వర్షం కురిసింది. ప్రధానం గా పట్టణంలో రామచంద్రాపురం కాలనీ, గోకుల మల్లయ్య బజార్, హనుమంతు ని గడ్డ ఏరియాలో వర్షం భారీగా కురిసింది. దీంతో రోడ్లపై వర్షం నీరు నిలిచింది. అనేక చోట్ల ఈదురుగాలులు వీచాయి. స్టేషన్‌రోడ్డులోని అండర్ బ్రిడ్జ్‌లో వర్షం నీరు చేరింది. బ్రిడ్జి పక్కన నీరు ఉండటంతో పాత బజార్‌కు వెళ్లే ద్విచక్ర వాహనదారులు ఇబ్బంది పడ్డారు. వర్షంతోపాటు గాలులు రావటంతో వాతావరణం చల్లబడింది.

కురిసిన వర్షం.. తడిసిన ధాన్యం.

దంతాలపల్లి : ఉదయం నుంచి ఉక్కపోతతో ఇబ్బంది పడ్డ ప్రజలు మంగళవారం సాయంత్రం వర్షం కురవడంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడి కాస్త ఉపశమనం పొందారు. మండలంలో మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి రైతులకు కష్టాలు తప్పలేదు. నెలలు గడిచినా రైతుల ధాన్యం కాంటాలు పెట్టకపోవడంతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి ముద్దయ్యాయి. కాంటాలైన ధాన్యాన్ని మిల్లులకు తరలించడంలో అధికారులు విఫలం కావడంతో కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం బస్తాలు తడిసి మొలకలు వచ్చే పరిస్థితులు కనిపిస్తున్నాయి. వెంటనే అధికారులు స్పందించి మొలకలు వచ్చిన ధాన్యం బస్తాలను మిల్లులకు తరలించాలని రైతులు కోరుతున్నారు.

నర్సింహులపేటలో భారీ వర్షం..

నర్సింహులపేటలో నీటీ రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపునీరు

నర్సింహులపేట : మంగళవారం నుంచి రుతుపవనాలు ప్రవేశించడంతో వర్షం దంచికొడుతుంది. దీంతో మండల వ్యాప్తంగా భారీ వర్షం పడుతుండటంతో రోడ్లపై ఫీట్ లోతు వర్షపునీరు ప్రవహించింది. దీంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బంది పడ్డారు. ముందస్తు వర్షాలు రావడంతో ఇప్పటికే దుక్కులు చేసుకున్న రైతులు విత్తనాలు వేసేందుకు సిద్ధవుతున్నారు.

అమ్మాపురం కొనుగోలు కేంద్రంలో నిలిచిపోయిన ధాన్యం

కల్లాల నుంచి కదలని ధాన్యం..

ఇంకా 3లక్షల బస్తాలు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే

తొర్రూరు, మే 27 : మండలంలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారుల నిర్లక్ష్యం, మిల్లర్ల కుమ్మక్కుతో ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం కదలక ఎక్కడికక్కడ పొరుకుపోయాయి. వర్షాలు కురుస్తున్నప్పటికీ తడిచిన ధాన్యాన్ని తక్షణం ఎగుమతి చేయాలన్న చిత్తశుద్ధి అధికారుల్లో కనిపించడం లేదని రైతులు వాపోతున్నారు. వర్షంలో తడుస్తున్న ధాన్యాన్ని కాపాడుకోలేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు కాంగ్రెస్ ప్రభుత్వం "ప్రతి గింజను కొంటాం" అని హామీ ఇస్తూ ప్రచారం చేస్తుండగా, స్థానిక అధికారులు మాత్రం మిల్లర్లతో చేతులు కలిపి తడిసిన ధాన్యాన్ని కొంటే నష్టమని, తడిసిన బస్తాకు ఐదు నుంచి పది కిలోలు తరుగు పేరిట కట్ చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. తొర్రూరు మండలంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 17ధాన్యం కొనుగోలు కేంద్రాలు, రెండు ఐకేపీ కేంద్రాలు పూర్తి స్థాయిలో పనిచేయడం లేదని, ఇప్పటికీ సుమారు మూడు లక్షల ధాన్య బస్తాలు కొనుగోలు కేంద్రాల్లోనే నిలిచిపోవడం రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. కురుస్తున్న అకాల వర్షాల కారణంగా ధాన్యమంతా తడిసి మొలకెత్తుతోంది. అయినా కూడా సంబంధిత అధికారులు స్పందించకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ తీరును ప్రశ్నించేలా చేస్తోంది. కొనుగోలు కేంద్రాల్లో ఉన్నా, ధాన్యం కొనకుండా రైతులను నిర్లక్ష్యం చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే తడిన ధాన్యాన్ని కొనుగోలు చేసి నష్టాన్ని నివారించాల్సిందిగా రైతులు డిమాండ్ చేస్తున్నారు.

తోడుకున్నోడికి తోడుకున్నంత..!

- **జోరుగా అక్రమ ఇసుక రవాణా**
- **పట్టించుకోని అధికారులు**

ఫకీర్‌తండా జీపీ శివారు ఆకేరువాగు నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు

నర్సింహులపేట, మే 27 : అందినకాడికి దోచుకుంటున్నారు.. మండలంలో పగలు, రాత్రి తేడా లేకుండా ఇసుక వాగులపై పడుతున్నారు.. ఇద్దరు, ముగ్గురు వ్యక్తులు తమ ట్రాక్టర్లను 24గంటలు నడిపిస్తున్నా వారిపై అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఎప్పుడో ఒకసారి వచ్చే ట్రాక్టర్లను పట్టుకుని కేసులు పెడుతున్నారని ఆరోపిస్తున్నారు. రాజకీయ అండదండలున్న కొందరు ఇసుక అక్రమ రవాణే ప్రధాన ధ్యేయంగా ఆకేరువాగు నుంచి ఇసుక అక్రమ తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఒకసారి ట్రాక్టర్ పట్టుబడితే రూ.5వేలు, రెండో సారి పట్టుబడితే రూ.10వేలు, మూడో సారి పట్టుబడితే సీజ్ చేయాలనే నిబంధనలు తుంగలో తొక్కి అక్రమార్కులకు తొత్తులుగా మారుతున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇసుక రవాణా చేసే ట్రాక్టర్‌ను ఆపితే నా ట్రాక్టరే అపుతారా..? నేను ఎవరో తెలుసా..? అని ఓ నాయకుడు బెదిరింపులకు దిగుతున్నాడని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోషల్ మీడియాలో పోస్టు చేసిన వారి అంతు చూస్తా? ఇంకా మూడేళ్లు మా ప్రభుత్వమే అధికారంలో ఉంటుంది. అంటూ బెదిరింపులకు దిగుతుండటంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇలాంటి వారు ఉంటే పార్టీ దెబ్బతింటుందని, వారిని నివారించాలని ఆ పార్టీ నాయకులే బహిరంగంగా ఆరోపిస్తున్నారు. అక్రమ దందాను అడ్డుకుని, బెదిరింపులకు దిగుతున్నవారిపై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై తహసీల్దార్ రమేశ్‌బాబు మాట్లాడుతూ అక్రమ రవాణా అడ్డుకునేందుకు సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. పోలీసుల సహకారంతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

అంబేద్కర్ విగ్రహావిష్కరణకు ఎంపీ రవిచంద్రను ఆహ్వానిస్తున్న ఆ సంఘం నాయకులు

విగ్రహావిష్కరణకు ఎంపీ రవిచంద్రకు ఆహ్వానం

ఇనుగుర్తి, మే 27 : మండల కేంద్రంలో జూన్03న భారతరాజ్యాంగ నిర్మాత, భారతరత్న డా.బాబాసాహెబ్ అంబేద్కర్ కాంస్య విగ్రహావిష్కరణ గాయత్రి గ్రూప్ ఆఫ్ కంపెనీ సహకారంతో నిర్వహించనున్నారు. విగ్రహావిష్కరణకు మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ముఖ్యఅతిథిగా హాజరుకావాలని ఆ సంఘం నాయకులు మంగళవారం ఖమ్మంలోని రవిచంద్ర క్యాంపు ఆఫీసులో కలిసి ఆహ్వాన పత్రిక అందించి ఆహ్వానించారు. ఎంపీ రవిచంద్ర ఇందుకు సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీని వారు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఇనుగుర్తి గ్రామ అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు పప్పుల వెంకన్న, బేతమల్ల చంద్రయ్య, గుజ్జునూరి బాబురావు, పింగిళి శ్రీనివాస్, నాగెల్లి సుధీర్ పాల్గొన్నారు.

మాజీ మంత్రి సత్యవతిరాథోడ్‌కు పరామర్శ

సత్యవతి రాథోడ్‌ను పరామర్శిస్తున్న రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, రెడ్యానాయక్

మహబూబాబాద్ రూరల్/నర్సింహుల పేట, మే 27 : మాజీ మంత్రి సత్యవతిరాథోడ్‌ను మంగళవారం హైదరాబాద్ యశోద హాస్పిటల్‌లో రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ పరామర్శించారు. సత్యవతి రాథోడ్ హైదరాబాద్‌లోని యశోద హాస్పిటల్‌లో మోకాళ్ల శస్త్ర చికిత్స చేయించుకున్నారు. కాగా, మంగళవారం సత్యవతి రాథోడ్‌ను వారు పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుకున్నారు. విశ్రాంతి తీసుకుని ఆరోగ్యం కుదట పడిన తరువాత ప్రజాక్షేత్రంలోకి రావాలని కోరారు.

కురవి : కట్ట పనులను పరిశీలిస్తున్న ఇరిగేషన్ ఈఈ సల్మాన్‌రాజు

కట్ట మరమ్మతు పనులు పూర్తి చేయాలి

కురవి(సీరోలు), మే 27 : సీరోలు మండలం కొత్తూరు (సీ) గ్రామంలోని చెరువు కట్ట మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఇరిగేషన్ ఈఈ సల్మాన్ రాజు సూచించారు. కొత్తూరు(సీ) గ్రామంలోని కొత్తకుంట చెరువు కట్ట గతంలో కురిసిన వర్షాలకు తెగిపోయింది. కట్ట మరమ్మతుకు నిధులు మంజూరు కాగా కాంట్రాక్టర్ చేపట్టిన పనులను మంగళవారం ఇరిగేషన్ ఈఈ సల్మాన్ రాజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం రాకముందే కట్ట పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట డీఈ విజయ్‌కుమార్, ఏఈ నిఖిల్, రైతులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే మదన్‌లాల్‌కు ప్రముఖుల నివాళి

మదన్‌లాల్ పార్థివదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ రవీందర్‌రావు, మాలోత్ కవిత, రెడ్యానాయక్

మహబూబాబాద్ రూరల్/ మరిపెడ, మే 27 : వైరా మాజీ శాసన సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ నాయకుడు బానోత్ మదన్‌లాల్ మంగళవారం అనారోగ్యంతో హైదరాబాద్ ఏఐజీ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మృతి చెందా రు. ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ ఎంపీ మాలోత్ కవిత హాస్పిటల్‌లో ఆయన పార్థివదేహాన్ని సందర్శించి ఘన నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అలా గే, ఖమ్మంలోని స్వగృహంలో డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ మదన్‌లాల్ పార్థివదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగా ఢ సానుభూతిని తెలిపారు. రెడ్యానాయక్ వెంట మరిపెడ మండల కోఆప్షన్ మాజీ మెం బర్ ఆయాబ్‌పాషా తదితరులు ఉన్నారు.

31న వరంగల్‌కు మందకృష్ణమాదిగ రాక

సమావేశంలో మాట్లాడుతున్న మిడతపల్లి యాకయ్య

కొత్తగూడ, మే 27 : ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఎన్నో పోరాటాలు, ఉద్యమాలు చేసి మాదిగ జాతి పక్షాన నిలబడి హక్కులు సాధించారని, వారి సేవలు, పోరాటాలను గుర్తించిన భారత ప్రభుత్వం పద్మశ్రీ అవార్డు ప్రకటించిందని ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ నాయకులు అన్నారు. రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము చేతుల మీదుగా పద్మశ్రీ అవార్డును ఈనెల 31న మందకృష్ణమాదిగ తీసుకుని వరంగల్ జిల్లాకు వస్తారని తెలిపారు. వరంగల్‌లో జరిగే సభలో అవార్డును మాదిగ అమరులకు, జాతికి అంకితం చేస్తారని ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ మానుకోట జిల్లా అధికార ప్రతినిధి మిడతపల్లి యాకయ్యమాదిగ అన్నారు. కొత్తగూడ మండల కేంద్రంలో మంగళవారం ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు చింత అనిల్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పద్మశ్రీ అవార్డును మాదిగ అమరుల కోసం జాతికి అంకితం చేసేందుకు ఈ నెల 31న మందకృష్ణమాదిగ వరంగల్ జిల్లాకు వస్తున్న సందర్భంగా అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ప్రేమ్‌సాగర్, గుగ్గిళ్ల వెంకన్న, కొట్టె శ్రీను, బాల్యశంకర్, తాళ్లపల్లి ప్రభాకర్, రవి, ఈశ్వరయ్య, అనిల్, సూరయ్య, రవి, మహేందర్, శ్రీను, రవి, కత్తి శంకర్, బోడ రవి, రాంబాబు, రామ్‌చరణ్ పాల్గొన్నారు.

అనుమతి లేని విత్తనాలు అమ్మితే చర్యలు

నర్సింహులపేట విత్తన దుకాణాన్ని పరిశీలిస్తున్న అధికారులు

నర్సింహులపేట, మే 27 : అనుమతులు లేని విత్తనాలు అమ్మితే చట్ట ప్రకారం చర్యలు తప్పవని ఏవో వినయ్ కుమార్ హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలోని విత్తన దుకాణాలను ట్రైనీ ఎస్సై షేక్ ఖాదర్‌పాషా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విత్తనాల కొనుగోలు విషయంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. బోల్‌గార్డు-3 కాటన్‌కు కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతి లేదని ఎవరైనా గ్రామాల్లో అమ్మినట్టు తెలిస్తే వ్యవసాయ అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ప్రతి డీలరు విత్తన నియంత్రణ చట్టం, 1983 ప్రకారం బిల్ బుక్, స్టాక్ రిజిస్టర్ రాయాలని తెలిపారు.

అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డీఏవో విజయలక్ష్మి

మెళకువలు పాటిస్తే సాగులో అధిక దిగుబడి

బయ్యారం, మే 27 : మెళకువలు పాటిస్తే సాగులో అధిక దిగుబడి పొందవచ్చని డీఏవో విజయ నిర్మలా, కేవీకే మల్యాల ప్రోగ్రాం కోఆర్డినేటర్ మాలతి అన్నారు. మండల కేంద్రంలోని సొసైటీ కార్యాలయంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు వానాకాలం సాగులో మెళకువలు, జాగ్రత్తలు, పచ్చి రొట్ట విత్తనాలు, పంట మార్పుపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏడీఏ శ్రీనివాసరావు, సొసైటీ చైర్మన్ మూల మధుకర్‌రెడ్డి, ఏవో రాజు, రాంజీ నాయక్, కేవీకే మల్యాల శాస్త్రవేత్తలు క్రాంతికుమార్, రాంబాబు, వ్యవసాయ విస్తరణ అధికారులు రచన, తేజస్వి, అఖిల్, ఫయాజ్, నాగరాజు, రైతులు పాల్గొన్నారు.

టీబీ రోగులకు న్యూట్రిషన్ కిట్లు అందజేత

దంతాలపల్లి, మే 27 : దంతాలపల్లి పీహెచ్‌సీ పరిధిలోని టీబీ రోగులకు ప్రభుత్వం నుంచి అందించే న్యూట్రిషన్ కిట్లు అందించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో టీబీ రోగులకు తొమ్మిది రకాల పోషణ విలువలు ఉన్న వస్తువులు కలిగిన న్యూట్రిషన్ కిట్లను రోగులకు డాక్టర్ చైతన్య అందించారు. కార్యక్రమంలో డాక్టర్ కవిత, హెల్త్ సూపర్‌వైజర్ సుజాత, టీబీ నోడల్ పర్సన్ చలపతి పాల్గొన్నారు.

సుందరీకరణ పనులు మార్పు చేయాలి

మహబూబాబాద్ రూరల్, మే 27 : పట్టణంలోని ముత్యాలమ్మ గుడి ఆలయం వద్ద ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్ శంకు స్థాపన చేసిన జంక్షన్ నిర్మాణాన్ని మార్పు చేయాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు వెన్నమల అజయ్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని ముత్యాలమ్మ గుడి వద్ద తమ కార్యకర్తలతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో అతి పురాతన కాలం నుంచి ఉన్న ముత్యాలమ్మ ఆలయం దగ్గర జంక్షన్ ఏర్పాటు చేయటం వల్ల భక్తుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతాయన్నారు. వెంటనే జంక్షన్ సుందరీకరణ నిర్మాణంలో మార్పు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్యామ్, అశోక్, మహేశ్, సందీప్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి

మహబూబాబాద్ రూరల్, మే 27 : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలని డీఈవో రవీందర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం పట్టణంలోని ఏకశిలా ఏంజల్ పాఠశాలలో ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. శిక్షణలో నేర్చుకున్న ప్రతి అంశాన్ని విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో బోధించాలన్నారు. గ్రామాల్లో బడిబాట కార్యక్రమాన్ని వినూత్నంగా నిర్వహించాలని విద్యార్థులకు తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలపైన మరింత అవగాహన పెంచాలన్నారు. కార్యక్రమంలో ఆజాద్ చంద్ర శేఖర్, అప్పారావు, శ్రీరాములు, ప్రవీణ్ పాల్గొన్నారు.

నాసిరకం విత్తనాలు అమ్మితే చర్యలు

గంగారం, మే 27 : రైతులకు సీడ్స్ డీలర్లు నాసిరకమైన విత్తనాలు అమ్మితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి వేణుయాదవ్ ఫర్టిలైజర్ డీలర్లకు సూచించారు. మండల కేంద్రంలోని రైతు వేదిక సెంటర్‌లో సీడ్స్, ఫర్టిలైజర్ డీలర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏవో వేణుయాదవ్ పలు సూచనలిచ్చారు. రైతు కొనుగోలు చేసిన విత్తనాలకు రసీదు తప్పకుండా అందించి స్టాక్ వివరాలు బోర్డుపై ఉంచాలన్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని సూచించారు. సమావేశంలో వ్యవసాయ విస్తరణ అధికారులు కిశోర్, ధరనీష్, డీలర్లు పాల్గొన్నారు.

చిలుక ప్రవీణ్‌పై కేసు నమోదు చేయాలి

మహబూబాబాద్ రూరల్, మే 27 : మహ్మద్ ప్రవక్తపై అనుచిత వ్యాఖ్యలు చేసిన చిలుక ప్రవీణ్‌పై కేసు నమోదు చేయాలని జిల్లా వక్ఫ్ బోర్డ్ పరిరక్షణ జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ ఇక్బాల్ పేర్కొన్నారు. మంగళవారం జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మతసామరస్యానికి, శాంతికి భంగం కలిగించే విధంగా ప్రవీణ్ ముస్లిం సమాజం మనోభావాలను గాయపరిచారన్నారు. ఎండీ ఫరీద్, ఆలంగీర్, హఫీజ్, వాహెద్, అసద్, సాబీర్ పాల్గొన్నారు.

మహిళకు తీవ్ర గాయాలు

డోర్నకల్, మే 27 : భవనంపై నుంచి పడి మహిళకు తీవ్ర గాయాలైన ఘటన ధాన్య తండాలో మంగళవారం చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే.. ధాన్య తండాకు చెందిన బానోత్ జయమ్మ మంగళవారం ఉదయం వేపపుల్ల కోసం భవనం పైకి ఎక్కింది. వేప పుల్ల విరిసే క్రమంలో భవనం నుంచి కింద పడింది. దీంతో జయమ్మకు తీవ్ర గాయాలు కావడంతో 108లో ఖమ్మం ఆసుపత్రికి తరలించారు.

నెహ్రూ చిత్ర పటానికి పూలమాల వేస్తున్న శంషాద్ బేగం, నాయకులు

ఘనంగా నెహ్రూ వర్ధంతి

గార్ల, మే 27 : భారతరత్న జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతి వేడుకలు మంగళవారం నెహ్రూ సెంటర్‌లో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో స్త్రీ శక్తి అవార్డు గ్రహీత శంషాద్ బేగం తాళ్లపల్లి కృష్ణగౌడ్, మాలోత్ వెంకట్‌లాల్, పృథ్వీరాజ్, కుమార్‌గౌడ్, భిక్షపతి పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేస్తున్న రామారావు

క్రికెట్ కిట్‌కు ఆర్థిక సాయం

కురవి, మే 27 : మండలంలోని రాజోలు శివారు హర్యతండాలో యువకులకు క్రికెట్ కిట్ కోసం డోర్నకల్‌కు చెందిన విజయ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మాలోత్ రామారావు మంగళవారం రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ వేసవి కాలంలో యువకులు క్రీడా నైపుణ్యం పెంచుకునేందుకు క్రికెట్ కిట్‌ను అందించినట్లు తెలిపారు. విద్యార్థులు, యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి క్రీడల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో తండా పెద్దలు పాల్గొన్నారు.

ప్రమాదపుటంచున నేరడ పెద్దచెరువు కట్ట

కురవి, మే 27: మండలంలోని నేరడ గ్రామ పెద్దచెరువు కట్టకు మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి బుంగ పడింది. చెరువుకట్టపై ఉన్న దర్గా నిర్మాణం దిగువ బాగాన బుంగ పడడంతో ప్రమాదం పొంచి ఉంది. .

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

jobs Apply Now!

★ఎలాంటి విద్యార్హత లేకున్నా ఫర్వాలేదు. మంచి వాక్చాతుర్యం కలిగినవారు మా సంస్థలో మార్కెటింగ్ చేయుటకు అనుభవం ఉన్నవారికి ఇదే మా ఆహ్వానం. 7981217883.

NT-325336

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552 HANAMKONDA
9182777563 WARANAGAL
9182777556 JAYASHANKAR BHUPALPALLY
9182777135 MULUGU
9182777135 MAHABUBABAD
9182777557 JANGAON
9182777565

తెలంగాణ సాయుధ పోరాటం

ప్రపంచానికే ఒక మైలురాయి

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు టీ సాగర్

రాజకీయ తరగతులలో మాట్లాడుతూన్న టీ సాగర్

మరిపెడ, మే 27 : వీర తెలంగాణ రైతాం గ సాయుధ పోరాటం ప్రపంచానికే ఒక మై లురాయి అని, కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో నిర్వ హించిన పోరాటంలో వేలాది మంది కమ్యూనిస్టులు బలిదానమయ్యారని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు టీ సా గర్ అన్నారు. మంగళవారం పురపాలక సం ఘం పరిధిలోని కనుకదుర్గ ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్న సీపీఐ(ఎం) పార్టీ రాజకీయ తరగతులలో భాగంగా జాతీయ ఉద్యమ చరి త్ర తెలంగాణ సాయుధ పోరాటం అంశంపై మూడో రోజు తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్‌తో కలిసి సాగర్ మాట్లాడారు. ప్రజా సేవ లో కమ్యూనిస్టు పార్టీలు ముందున్నాయన్నా రు. లక్షలాది ఎకరాల భూములను పేదలకు పంచారన్నారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు గునుగంటి రాజ న్న, సుర్నపు సోమయ్య, కుంట ఉపేందర్, కందనూరి శ్రీనివాస్, మండల కార్యదర్శి గుండగాని మధుసూదన్, నాయకులు బాణాల రాజన్న, దుండి వీరన్న, బోడపట్ల రాజశేఖర్, కందాల రమేశ్, కొండ ఉప్పలయ్య, దొంతు మమత ఉన్నారు.

అంగన్‌వాడీలో

కుళ్లిన కోడిగుడ్లు

డోర్నకల్, మే 27 : బోడ మంజ్యాతండా కు చెందిన నలుగురు లబ్ధిదారులు కస్నాతండా అంగన్‌వాడీ కేంద్రం నుంచి మంగళవారం కోడిగుడ్లు తీసుకెళ్లారు. ఇంటికి వెళ్లి చూడగా కో డిగుడ్లు కుళ్లిపోయి, దుర్వాసన వెదజల్లుతున్నాయి. అంగన్‌వా డీ కేంద్రంపై చర్యలు తీసుకోవాలని స్థానికులు అంటున్నారు. దీనిపై సీడీపీవో లక్ష్మిని వివరణ కోరగా నాణ్యమైన కోడిగుడ్లు కాంట్రాక్టర్ వద్ద తీసుకోమని అంగన్‌వాడీ టీచర్లకు చెప్పుతున్నాం. దీనిపై విచారణ చేపటనున్నట్లు సీడీపీవో తెలిపారు.

రైతుల నడ్డి విరుస్తున్న ప్రజా ప్రభుత్వం

భారీగా జీలుగ విత్తనాల ధర పెంపు

ఇనుగుర్తి, మే 17 : రైతు సంక్షేమమే ధ్యేయమంటున్న ఈ ప్రజాప్రభుత్వం జీలుగ విత్తనాల(పచ్చిరొట్ట విత్తనాలు)ధరలు భారీగా పెంచి వ్యవసాయ సాగుకు ముందే రైతుల నడ్డి విరిచింది. సాగుకు ముందుగా భూసారం పెంచుకోవడానికి జీలుగ విత్తనాలను వ్యవసాయ చేనుల్లో అలికి వర్షాలు పడడంతో వాటిని భూమిలో కలిపి దున్నుతారు. గత సంవత్సరం 30కేజీల ఈ జీలుగ విత్తనాల బస్తాకు రూ.2790 ఎమ్మార్పీ ఉండగా 60శాతం సబ్సిడీతో రైతులకు రూ.1,116కు ప్రభుత్వం అందించింది. ఈ ఏడాది అదే 30కేజీల బస్తాకు ఎమ్మార్పీ రూ.4275కు పెంచి 50శాతం సబ్సిడీతో రూ.2,137కు రైతులకు అందిస్తుంది. ఒక్కో జీలుగ బస్తాపై రూ.1,021 ధర పెంచడంతో రైతులపై కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్న మొసలిప్రేమ బయటపడిందని రైతులు చర్చించుకుంటున్నారు.

పెంచిన ధరను వెంటనే తగ్గించాలి..

జీలుగ విత్తనాలపై కాంగ్రెస్ ప్రభుత్వం పెంచిన ధరను వెంటనే తగ్గించాలి. గత సంవత్సరం 60శాతం సబ్సిడీ ఉన్న ఈ విత్తనాలకు ఈ ఏడాది 50శాతానికి కుదించింది. గతేడాది కంటే ఒక్కో బస్తాపై రూ.1,021పెంచింది. రైతులకు మేలు చేస్తామంటే విత్తనాల ధరలు పెంచడమేనా. సాగుకు ముందే జీలుగ బస్తాలకు ఇంత భారీగా ధరలు పెంచితే పురుగుల మందులు, మందు బస్తాలకు కూడా ధరలు పెంచుతుందోనని భయం వేస్తుంది. ఈ ఏడాది సాగు చేయాలో వద్దోనని గుబులు పట్టుకుంది.

- రాయిలి శేఖర్, ఇనుగుర్తి మండలం, చిన్నముప్పారం, రైతు

నల్ల బెల్లం, పటిక స్వాధీనం

మహబూబాబాద్ రూరల్, మే 27 : మండల శ